కారు-చౌక బేరం...!

- ఉత్తరాది కార్ల అమ్మకాల జోరు
- గుంటూరు జిల్లాలో ఢిల్లీ బండ్లు రయ్... రయ్...
- బిహార్, హరియాణా రిజిస్ట్రేషన్ వాహనాలు అధికమే
- ఇక్కడ ధరల కంటే.. అక్కడ తక్కువకే వాహనాలు



గుంటూరులో తిరుగుతున్న హరియాణా నుంచి కొనుగోలు చేసిన కారు

పట్నంబజారు: నగరానికి చెందిన ఒక వ్యాపారి కార్లు కొని విక్రయిస్తుంటాడు. ఢిల్లీ, కర్ణాటక, హరియాణా రాష్ట్రాలకు చెందిన సెకండ్ హ్యాండ్ వాహనాల వివరాలు తెలుసుకుని.. ఆసక్తి ఉన్న వారికి వాట్సాప్ ద్వారా ఆ ఫొటోలను పంపి క్రయ విక్రయాలు జరుపుతున్నారు. కారు యజమాని, కొనుగోలుదారుడు ఇద్దరి తరుపున మధ్యవర్తిత్వం చేసినందుకు ఆ కారు రేటును బట్టి ఇద్దరూ రెండు శాతం ఇవ్వాల్సి ఉంటుంది. కొంత మంది వ్యాపారులు ఢిల్లీ, కర్ణాటక, హరియాణా ప్రాంతాల నుంచి వాహనాలను తక్కువ రేట్లుకు తీసుకుని వచ్చి, పూర్తి స్థాయిలో వాటిని బాగుచేయించి, కొద్ది మేర లాభాలను చూసుకుని విక్రయాలు జరుపుతున్నారు.

ఢిల్లీ వాహనాలకు డిమాండ్..

సెకండ్ హ్యాండ్ కార్లు కొనాలనుకునే వారంతా ఎక్కువగా ఢిల్లీ వైపే చూస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా సెకండ్ హ్యాండ్ వాహనాల ఫొటోలు, డాక్యుమెంట్లు సరిచూసుకుని.. లావాదేవీలు చేస్తున్నారు. మధ్యవర్తిత్వం చేసిన వారికి.. కమీషన్ ఇస్తుండటంతో ఎవరికీ నష్టం రాదు. ఇక కర్ణాటక వాహనాలకూ డిమాండ్ ఉంది.

అక్కడ నిషేధం.. ఇక్కడ లాభం

ఢిల్లీలో కేవలం పది సంవత్సరాలకే వాహనాల సామర్థ్యం ముగుస్తుంది. దక్షిణాది రాష్ట్రాల్లో 15 ఏళ్ల వరకు రోడ్డెక్కే అవకాశం ఉండటంతో పాటు, వాహన సామర్థ్యాన్ని బట్టి, మరొక ఐదేళ్లు వాహన కాలపరిమితిని పెంచుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ, బిహార్, హరియాణా రాష్ట్రాల వాహనాలను భారీగా కొనుగోలు చేస్తున్నారు. అక్కడ నిషేధించిన వాహనాలు కావడంతో తక్కువ ధరలకే విక్రయిస్తారు. డిమాండ్‌కు అనుగుణంగా ఆయా కంపెనీల వాహనాలను తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు.

నంబర్ ప్లేటు కచ్చితంగా మార్చుకోవాలి

ఉత్తరాది రాష్ట్రాల నుంచి తీసుకునివచ్చే వాహనాలకు సంబంధించి కేవలం 15 రోజుల నుంచి 30 రోజుల వ్యవధి మాత్రమే నంబరు ప్లేటు మార్చుకునేందుకు అవకాశం ఉంటుంది. కచ్చితంగా పొరుగు రాష్ట్రాల నుంచి తీసుకునివచ్చిన వాహనాలకు చలానాలు చెల్లించి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. చలానాలు చెల్లించిన తరువాత ఏపీకి చెందిన నంబరు ప్లేటును కేటాయిస్తారు. అప్పుడే వాహనాలు మన రోడ్లపై తిరిగే అవకాశం ఉంటుంది.

తక్కువ ధరకే..

మన రాష్ట్రంతో పోలిస్తే ఇతర రాష్ట్రాల్లోని సెకండ్ హ్యాండ్ వాహనాలు తక్కువ ధరకే దొరుతుండటంతో జిల్లా వాసులు చాలా మంది అక్కడి నుంచే కొనుగోలు చేస్తున్నారు. దీనితో ఉత్తరాది వాహనాల జోరు పెరిగిపోయింది. ఢిల్లీ, బిహార్, హరియాణా, మధ్యప్రదేశ్ తదితర ఉత్తరాది వాహనాలతో పాటు ఒడిశా, పుదుచ్చేరి, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలు గుంటూరులో అధికంగా కనపడుతున్నాయి. వినియోగదారుడికి తక్కువ ధరకే వాహనాలు ఇప్పిస్తున్న క్రమంలో ఏజెంట్లుకు లాభాలు వస్తుండటంతో.. వాహనాల కొనుగోళ్లు, అమ్మకాలు ఉపందుకున్నాయి.

డాక్యుమెంట్లు సరి చూసుకోవాలి..

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలను కొనుగోలు చేసి ఇక్కడకు తెచ్చుకుంటున్నారు. ఒక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ వాహనం ఏపీలో తిప్పాలంటే మళ్లీ మన వద్ద ట్యాక్స్ కడితే ఏపీ రిజిస్ట్రేషన్ చేస్తాం. అలాగే ఒక రాష్ట్రంలో నమోదైన వాహనాలను మరో రాష్ట్రానికి తరలించేందుకు తప్పనిసరిగా రవాణా శాఖ అనుమతి అవసరం. రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్, వాహన యజమాని చిరునామా ఉన్న వాటినే కొనుగోలు చేయాలి. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసీ) ఉన్న వాటిని ఎక్కడైనా విక్రయించవచ్చు. వాహనాన్ని కొనుగోలు చేసిన తరువాత వినియోగదారుడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవటంతో పాటు, పూర్తిస్థాయిలో రవాణాశాఖ నిబంధనలు పాటించాలి.

ర్యాంపులను వెంటనే తొలగించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు


ర్యాంప్‌లను తొలగించాలని అధికారులకు సూచిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లలో వ్యర్థాలు తీయడానికి వీలు లేకుండా ఏర్పాటు చేసిన ర్యాంప్‌లను వార్డు సచివాలయాల వారీగా తక్షణం తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్నం బజార్, ఏలూరు బజార్, శ్రీనివాసరావుతోట, చౌడవరం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత పట్నం బజార్, ఏలూరు బజార్‌లలో నూతనంగా నిర్మాణం చేసిన డ్రెయిన్లపై ర్యాంపులను గమనించి, రోడ్ల మీద కురిసిన వర్షంనీరు డ్రెయిన్‌లోకి వెళ్లలేకపోవడం, డ్రెయిన్‌లోని వ్యర్థాలను తొలగించడానికి వీలు లేకుండా ఉన్న ర్యాంప్‌లను తక్షణం పొక్లెయిన్‌తో తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శ్రీనివాసరావుతోట ప్రాంతంలో డ్రెయిన్‌లో వర్షానికి వచ్చిన వ్యర్థాలను తొలగించక పోవడంపై సచివాలయ శానిటేషన్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీకలవాగు వెంబడి వ్యర్థాలను డంప్ చేయడానికి వీలు లేదని, ఇప్పటి వరకు ఉన్న డంప్‌ని తొలగించాలని సూచించారు. అనంతరం చౌడవరంలోని రాజీవ్ గృహకల్పలో పారిశుద్ధ్యం, తాగునీరు వంటి మౌలిక వసతులను వారం రోజుల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, ఈఈ వేణు, డీఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిన్నింగ్, టీఎంసీ మిల్లు ముఠా కార్మికుల సమ్మె

లక్ష్మీపురం: నగరంలోని జిన్నింగ్, టీఎంసీ మిల్లులో పని చేస్తున్న ముఠా కార్మికులకు కూలీ రెట్ల అగ్రిమెంట్ కాలపరిమితి పూర్తి అయి ఏడాది గడుస్తున్నా యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై ఏఐటీయూసీ రాష్ట్ర హమాలీ ఫెడరేషన్ అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు ఏటుకూరు రోడ్డులోని సీతారామ కళ్యాణ మండపంలో ముఠా కార్మిక సంఘం జిన్నింగ్, టీఎంసీ మిల్లుల విభాగం జనరల్ బాడీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న ముఠా కార్మికులకు కూలీరెట్ల పెంపుదల అగ్రిమెంట్ చేయాలని యాజమాన్యని ఇప్పటికి ఐదు సార్లు నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. యాజమాన్యం వైపు నుంచి ఎటువంటి స్పందన లేని కారణంగా కార్మికుల సమ్మె చేయటానికి సిద్ధంగా ఉన్నరని తెలిపారు. నగర ముఠా కార్మిక సంఘం, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు జి.సురేష్‌బాబు, రావుల అంజిబాబు మాట్లాడుతూ కార్మికులు యాజమాన్యం కార్మిక సంక్షేమాన్ని మరచి తన ఆదాయాన్ని రెట్టింపు చేసుకుఓవడం జరుగుతుందన్నారు. కార్మికుల సౌకర్యాలను కల్పించకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న ఈ యాజమాన్యం కార్మికులు సమ్మె హక్కు ద్వారా తమ కూలీ రెట్ల పెంపుదల చేసుకోడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో జిన్నింగ్, టి.ఎం.సీ విభాగం నాయకులు బోయపాటి శ్రీకాంత్, కొత్తనాన్ని, రేగుల నవీన్, ఎస్పీ కోండయ్య, రామినేని శ్రీనివాస్, నాగేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన రూ.45 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు తెలిపారు. అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాంబాబు మాట్లాడుతూ అవోపా ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ, ఎన్డీ ఆర్ ఎఫ్ కమాండర్ ప్రసన్న కుమార్, క్రేన్ సంస్థల అధినేత కాంతారావు, నందనంపాటి రామాంజనేయులు, దూండి రాకేష్ తదితరులు అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో గార్లపాటి సత్యనారాయణ, రాచపూడి సుబ్బారావు, వెంకటేశ్వరరావు, మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇండియన్ క్రాఫ్ట్ బజార్ ప్రారంభం

నగరంపాలెం: గుంటగ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఇండియన్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ షాపింగ్ ఎక్స్‌పో-25ను శుక్రవారం ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రకాల చేతివృత్తుల కళాకారులు రూపొందించిన వస్తువులను క్రాఫ్ట్ బజార్ ద్వారా అందుబాటులోకి తేవడం అభినందనీయమని అన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గత 15 ఏళ్లుగా అన్ని జిల్లాల్లో ఈ ఎక్స్‌పోలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది వరకు ఉంటుందని అన్నారు. ప్రవేశం ఉచితమని తెలిపారు.

నర్సింగ్ స్కూల్‌లో డిజిటల్ క్లాస్ రూము

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో శుక్రవారం డిజిటల్ క్లాస్ రూంను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. డిజిటల్ క్లాస్ రూముకు ప్రొజెక్టర్‌ను రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎ.మల్లేశ్వరి, ప్రొజెక్టర్ స్క్రీన్‌ను సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్స్ చంద్రకళ, ఎలిజిబెత్, ఆర్ఎంఓలు శ్రీదేవిప్రియ, శ్రీనివాసరాజు, నర్సింగ్‌ట్యూటర్స్ అనసూయ, తాజున్నీసా, పద్మజ, శాంతిశ్రీ, వార్డెన్ సుజాత పాల్గొన్నారు.

దేవస్థానంపై ఆరోపణలు అవాస్తవం

నగరంపాలెం: రెండు రోజులుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని 104వ శ్రీమద్దేవి నవరాత్రి మహోత్సవ ఉత్సవ కమిటీ చైర్మన్ కోట వెంకటశివశేషగిరిరావు అన్నారు. ఆర్.అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవస్థానంలో గతంలో లేని విధంగా కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ (బస్‌బాబు) మాట్లాడుతూ గతంలో జరిగిన ఉత్సవాలకు సంబంధించి ప్రతి ఖర్చుని తెలియజేశామని అన్నారు. సమావేశంలో గౌరవ సలహాదారు కొనకళ్ల సత్యం, వనమా నరేంద్ర, కన్వీనర్లు వలివేటి కృష్ణ, కూనిశెట్టి చంద్రశేఖర్, జూలూరి హేమానంద్‌గుప్త పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

నెహ్రూనగర్: ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు వార్డు సచివాలయ కార్యదర్శులు అంకితభావంతో పని చేయాలని గుంటూరు నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు ఆదేశించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలోని నవభారత్ కాలనీలోని 4, 6, శ్యామల నగర్‌లోని 103, 104, పెద్ద పలకలూరులోని 171, 172 వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. తొలుత వార్డు సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వలన రొమ్ము క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందని, వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలతో వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చని ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. శుక్రవారం జొన్నలగడ్డ తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి పీసీఓడీ, పీసీఓఎస్, బెస్ట్ క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పీసీఓడీ నివారణకు ఆహారపు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.నారాయణ, ఇతర సిబ్బంది డాక్టర్ ఉమా శంకర్ దంపతులను ఘనంగా సత్కరించారు.

ఉర్దూ టీచర్ రజియాబేగం సేవలు అభినందనీయం



రజియాబేగంను అభినందిస్తున్న మొహ్మద్ ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాస్థాయిలో ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న పి.రజియాబేగం సేవలు అభినందనీయమని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం పేర్కొన్నారు. చిన్నబజారులోని నగరపాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న రజియాబేగం ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం రోజున జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారాన్ని పొందిన సందర్భంగా చౌత్రా సెంటర్‌లోని ఉర్దూ డీఐ కార్యాలయంలో శాలువా కప్పి, సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ తెలుగు ఉపాధ్యాయుడు తేజా నాయక్, ఎంటీఏ నాయకులు కలీం, ఇషాక్, దరియావలి పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్ట్ వృత్తిపై అపోహలు సృష్టించారు


వెంకట హరికృష్ణ

గుంటూరు మెడికల్: ఫిజియోథెరపిస్టులపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ కార్యాలయం నుంచి వెలువడిన లేఖ ద్వారా సరైన దిశ, నిర్దేశం లేకుండానే వార్తా ప్రసార మాధ్యమాల్లో అనవసర అపోహలు సృష్టించి, గందరగోళానికి గురిచేశారని ది ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాపట్ల వెంకట హరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇవన్నీ కేవలం అపోహలేనని, మళ్లీ కార్యాలయం వారు ఫిజియోథెరపిస్టులు తమ పేరు ముందు డాక్టర్ పెట్టుకోవచ్చని లేఖ విడుదల చేసిందని వివరించారు. ఫిజియోథెరపిస్టులకు ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, గతంలోనే తాము ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు. క్వాలిఫైడ్ ఫిజియోథెరపిస్టులు వారి పేరు ముందు డాక్టర్ అని, చివరిన పీటీ అని పెట్టుకోవచ్చని గతంలో ఎంతో మంది నిపుణులు, వైద్యులు చెప్పారని గుర్తు చేశారు. గతంలో ఫిజియోథెరపిస్టు వృత్తిని నేషనల్ కమిషన్ ఎలైడ్ హెల్త్ ప్రొఫెషనల్స్ యాక్ట్ 2021 ప్రకారం స్వతంత్ర ఆరోగ్య వృత్తిగా ప్రభుత్వం గుర్తించిందని వివరించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్ వారు కూడా తమకు గుర్తింపు ఇచ్చినట్లు హరికృష్ణ వెల్లడించారు.

టీడీఎస్ పూర్తి చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన


ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు తూర్పు, రూరల్ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన టీడీఎస్ ఈ-ఫైలింగ్‌ను తక్షణమే పూర్తి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఈ-ఫైలింగ్ గడువు ఈనెల 15న ముగుస్తున్నప్పటికీ తూర్పు, రూరల్ మండలాల పరిధిలోని ఉపాధ్యాయుల వేతనాల్లో నుంచి మినహాయించిన ఆదాయపు పన్నుకు సంబంధించిన ఈ-ఫైలింగ్ పూర్తి కాలేదని, ఫలితంగా ఉపాధ్యాయులు పెనాల్టీ చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ రెండు నెలలుగా పలు దఫాలుగా విజ్ఞప్తులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, టీడీఎస్ ఈ-ఫైలింగ్ పూర్తి చేయని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గతేడాది ఇదే విధంగా సకాలంలో ఈ-ఫైలింగ్ పూర్తి చేయకపోవడంతో ఆదాయపు పన్నుశాఖ ఉపాధ్యాయుల నుంచి జరిమానా వసూలు చేసిందన్నారు. నిరసన ప్రదర్శనలో సంఘ నాయకులు జి.వెంకటేశ్వర్లు, బి.ప్రసాద్, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, షకీలాబేగం, గోవిందు, ఎం.కోటిరెడ్డి, ఎం. చెన్నయ్య, రెహ్మాన్, శివరామిరెడ్డి, ధనలక్ష్మి, రాఘవులు, నరసింహారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపి వేయనున్నట్లు అధికారులు వేర్వేరు ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సుద్దపల్లి డొంక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని టీ-4 డీఈఈ పీహెచ్ ఖాన్ చెప్పారు. ప్రగతీనగర్, యానాది కాలనీ, పాముల కాలనీ, బాలాజీనగర్, కొండలరావు కాలనీ, అల్లీనగర్, యాదవుల బజార్, బూరెలువారి వీధి, లక్ష్మీనగర్ , తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

- 11 కేవీ బీఆర్ స్టేడియం ఫీడర్ మరమ్మతులతో పాతగుంటూరు పోలీసు స్టేషన్ ప్రాంతం, అంకమ్మతల్లి గుడి, సత్యనారాయణ స్వామి గుడి, కమ్యూనిస్టు బొమ్మలు, సూర్యనగర్, ముగ్దుంనగర్, ప్రియాంక గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కోత ఉంటుందని చెప్పారు.
- కాకుమానుతోట ఉప కేంద్రంలోని 11 కేవీ బొంగరాల బీడు, వసంతరాయపురం ఫీడర్ మరమ్మత్తుల కారణంగా బొంగరాలబీడు, వెంగయ్య నగర్, సంజీవయ్య నగర్, వసంతరాయపురం, వెంగలరావు నగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీ-4 డీఈఈ ఖాన్ తెలిపారు.
- ఫీడర్ల మరమ్మతుల కారణంగా డీ-3 సెక్షన్‌లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. గుంటూరువారితోట, ఓల్డ్‌క్లబ్ రోడ్, గణేశ్వరరావుపేట, రామిరెడ్డితోట, కొత్తపేట, శివాలయం రోడ్, పాత్తూరివారితోట, అలాగే డీ-10 సెక్షన్ పరిధిలో సంగడిగుంట, బుడంపాడు, పొన్నూరు రోడ్, చంద్రబాబునాయుడు కాలనీ, రావూఫ్ కాలనీ, బ్రాడీపేట, కొరిటెపాడు, రామన్నపేట, నాయుడుపేట, హనుమయ్యనగర్, సౌభాగ్యనగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని టౌన్-1 డీఈఈ షేక్ ముస్తాక్ అహమ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.
- 11 కేవీ లైన్ మెయింటెనెన్స్ కారణంగా శ్యామలానగర్, స్తంభాలగరువు తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-2 డీఈఈ ఎస్.గురవయ్య తెలిపారు వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ఘనంగా హిందీ భాష దినోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో ముందస్తు జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ భాష హిందీ భారతదేశంలో మొదటిస్థానంలోనూ, ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. ప్రతి విద్యార్థి తన మాతృభాషతో పాటు ఆంగ్లానికి ప్రాధాన్యం ఇస్తున్న విధంగా జాతీయ భాష అయిన హిందీకి అంతే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.విద్యార్థులు హిందీభాషలో గేయాలు, హిందీ కవుల వేషధారణలతో నృత్య ప్రదర్శనలు చేశారు.

విద్యార్థులు హిందీ భాషలో ప్రావీణ్యులు కావాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు హిందీ భాషలో ప్రావీణ్యులు కావాలని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జీకేసీ కళాశాలలో డ్డులోని కేఎల్‌పీ స్కూల్లో జాతీయ హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటున్న విద్యార్థులు హిందీ భాషను సైతం నేర్చుకోవాలని, తద్వారా దేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా భాషాపరమైన సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయని అన్నారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగం అధికారికంగా ప్రకటించగా, 1953 నుంచి ప్రతియేటా హిందీ భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీపూజిత స్కూల్లో రెడ్ కలర్ డే



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో శుక్రవారం రెడ్ కలర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులందరూ ఎరుపు వర్ణంలో వస్త్రాలను ధరించి ఫ్యాన్సీలో ర్యాంప్‌పై నడిచి ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులకు ఎరుపు వర్ణం కలిగిన ఆట సామగ్రితో వివిధ రకాల ఆటలు ఆడారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



లక్ష్మీపురం: దేశంలో అందరికీ ఉచిత విద్య అందాలని దివంగత సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి ఎన్నో పోరాటాలు నిర్వహించారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ అన్నారు. గుంటూరు జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడుగా ఈ దేశంలో విద్యారంగంలో వస్తున్న మార్పులు పైన అనేక సలహాలను సూచనలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవన్ కుమార్, షేక్ సమీర్, నగర కార్యదర్శి ఏ యశ్వంత్ పాల్గొన్నారు.

కొరియోగ్రాఫర్ శష్టి వర్మ వాల్‌పోస్టర్లు దహనం



లక్ష్మీపురం: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ మహనీయులను అవమానించిన కొరియోగ్రాఫర్ శష్టి వర్మ బిగ్ బాస్ లాంటి షో నుంచి తప్పించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం డిమాండ్ చేశారు. గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని శుక్రవారం కొరియోగ్రాఫర్ శష్టి వర్మ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శష్టి వర్మపై 90 రోజుల క్రితం స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. చర్యలు తీసుకోకపోతే హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియో వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు.

మర్యాదపూర్వక కలయిక...



పట్నంబజారు: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్, నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ఉన్నారు.

అంబటితో అంగన్‌వాడీ విభాగ నాయకులు..



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును ఇటీవల నూతనంగా పార్టీ అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు సత్తెనపల్లి రమణీ, పార్టీ నేతలతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ఒక మంచి పదవి వచ్చిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సుబ్బులు, యాదాల చిన్నా, రజియాబేగం పాల్గొన్నారు.

ప్రారంభమైన అమరావతి నాట్యోత్సవం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై కేఆర్‌కేఎం మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ ఏపీ సంయుక్తంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న అమరావతి నాట్యోత్సవం- 2025 శుక్రవారం ప్రారంభమయ్యాయి. కేరళ కళాకారిణి రాధికశ్రీ ప్రదర్శించిన కథకు, బాలే నృత్యాలు అలరించాయి. డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో త్యాగరాజ విరచిత ప్రహ్లాద భక్తి విజయం నృత్య రూపకం అలరించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గల్లా మాధవి, దేవస్థానం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ, జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, ట్యాక్స్ బార్ అసోసియేషన్ చైర్మన్ రామరాజుశ్రీనివాస్, నిర్వాహకురాలు కోక విజయలక్ష్మి పాల్గొన్నారు.